("తరుణ" మాసపత్రిక; ఆగస్టు 1972)

మూడు గదులు

"మీ మొహంమీద ఎండ పడుతోంది"

నల్లకళ్ళజోడులోంచి చూస్తూ గళ్ళచొక్కా తొడుక్కున్న ఆ యువకుడు గిరిజకి చెప్పేడు.

"థాంక్స్! నాకు తెలుసు!" గిరిజ అప్రయత్నంగా అతనివేపు, షెడ్ లోకి, షేడ్ లోకి జరిగింది.

సాయంకాలం ఆరుకాలేదింకాను.

గిరిజ నలభయ్యోనెంబరు బస్సుకోసం చూస్తోంది. బస్సులు సికింద్రాబాదు వేపునించి వొస్తున్నాయి. వెళుతున్నాయి. అన్నిటినిండా వేళ్ళాడుతూ జనం.

అంత జనంలోనూ ఎలాగో ఓలాగ వెళిపోయితీరాలన్న ఒత్తిడీ గండకత్తెరా ఏమీలేవు గిరిజకి. ఎవరేనా పలకరిస్తే ఓగంట అటో యిటో ఖాళీగా తిరిగొచ్చినా యిబ్బందిలేదు.

ఇరవై ఏళ్ళు నాలుగేళ్ళకిందటే వెళ్ళిన గిరిజ నలభయ్యో నెంబరు బస్సుకోసం చూస్తూ అరవై సెకండ్లు గల ఒక్కొక్క నిమిషంలోనూ ఎనభయ్యేసి గాలిమేడలు కడుతూ నూరు సంవత్సరాలు గడిపినట్టు అలిసిపోగలదు. కలల్లో కూడా జీవితమే కొట్టొచ్చినట్టు. కనబడిపోతుందని గిరిజకి ఉత్సాహం నీరుకారిపోతుంది తరుచూనూ.

జీవితం ముళ్ళపందిరి!

నీడగానే ఉంటుంది. ఒదిగి ఒదిగి నడుచుకుంటూ ఎలాగో ఎత్తుకి ఎదగాలి. కాని ఏమాత్రం ఆవేశపడ్డా ఎదలో ఎరగరానన్ని; తలలో తలచరానన్ని ముళ్ళు దిగుతాయి.

ఈ చదువు ఈ ఏడాది అవదు. మళ్ళీ ఏడాది కూడా వుంది. తద్దినం— చదవాలి— తిరగాలి— రెస్టు తీసుకోవాలి— సంపాదించుకోవాలి— సరదాలు తీర్చుకోవాలి— "రోజూ ఇదే" నని నిర్ధారణైపోయిన జీవితంలోంచే ఏదో కొత్త రుచీ వెరైటీ సంపాదించుకోవాలి.

"వాంట్స్ ఆర్ అన్ లిమిటెడ్" అన్నాడు ఎకానమిస్టు.

కోరికలు అసంఖ్యాకం. వాటిని తీర్చుకోడానికి అవకాశాలు బహుకొద్ది. అది ఎకనామిక్స్‌లో ఇంచుమించు మొదటిపాఠం. ఆ పాఠపు సారాంశాన్ని ఆధారం చేసుకుని ప్రపంచం అంతా నడుస్తోందిట.

ప్రపంచం అంతటిమాటా యెలావున్నా తనపట్ల ఈ సిద్ధాంతం జీవిత సత్యం— కోరికలు— అన్ లిమిటెడ్! ఈ కోరికలు ఇక్కడ కనబడే జనం మొహల్లా అంతులేకుండా ఒక దానితరవాతొకటి— వేరే వేరే ఆకారాల్లో సిద్ధమవుతూ వుంటాయి. వాటన్నిట్నీ తీర్చుకునేలోగా జీవితమైనా ఆగిపోతుంది; వయస్సైనా చెల్లిపోతుంది. అంచేత కొన్నిమాత్రం తీర్చుకుని— తరవాత ఏదో విధంగా జీవితంతో రాజీపడి— బహుశా పెళ్ళి చేసుకొని—

పెళ్ళి చేసుకోకముందే డిగ్రీ తీసుకోవాలి. పెళ్ళి చేసుకొనే నాటికీ బ్యాంక్‌లో నాలుగు వేలయినా ఉండాలి.

ఆమాత్రం డబ్బు నాదగ్గిర లేకపోతే నన్ను శాశ్వతంగా భరించడానికి ఏ మొగమహారాజూ ముందుకి రాడు.

పెళ్ళికూడా చేసుకోవాలి!

ఎవడో, అదృష్టవంతుడు?— లేక దురదృష్టవంతుడా, నిమ్మీ అన్నట్టు!

నిమ్మీ పెళ్ళయ్యాక కట్టూ, బొట్టూ తిరుగుడూ, మాటా మనసూ మొత్తం మార్చేసి ఏకపత్నీవ్రత అయిపోయింది. ఆఖరికి శ్రావణమాసం నోములూ శనివారాలూ కూడా చేసేస్తోంది.

నేనొక ఆర్టిస్టుని పెళ్ళాడతాను!

ఆర్టిస్టంటే బొమ్మ వేసేవాడే కానక్కర్లేదు. కవి, నావలిస్ట్, మ్యూజిషియన్ ఎవడైనా.... సౌందర్యారాధన తెలిసిన, కళాకారుడు— నా అందాన్ని మెచ్చుకుని నేనివ్వగల ఆనందాన్ని అందుకొని నా తప్పుల్ని తన విశాల హృదయంతో ఎక్కడో ఓమూల దాచేసి మిగతా అంతటా నేనే, నాస్మరణ నారూపమే నిలుపుకోగలవాడు—

వాడెవడో—?

ఈ పక్కనున్న గళ్ళ షర్టబ్బాయి—?

సైడ్ బర్న్సూ, నల్లకళ్ళద్దాలూ కుడిచేతికి వాచీ— ఆర్భాటంగానే ఉన్నాడు.

కాని వీడు ఆర్టిస్టు కాదు.

ఎవడో వాడ్డీ వ్యాపారస్తుడి కొడుకులా ఉన్నాడు. వ్యాపారస్తుడులా వున్నాడు— వ్యాపారం ఆర్టుకాదు.... సైన్సా?— అదీ కాదేమో? — ఆర్టిస్టుల కంటే, సైంటిస్టులకంటే వ్యాపారస్తులే గొప్ప వాళ్ళలా మెసులుతారు.

"మీరు—" అన్నాడు.

గిరిజ చూసింది.

అతను తడబాటు నటిస్తూ "ఎక్కడో చూసినట్టు—" అన్నాడు.

"అవును; ఎక్కడో చూసినట్టే వుంది—"

"ఎంతవరకు వెళ్ళాలి?"

"బీగం బజార్."

"నేనూ అటే......ఆటోలో పోదామా, పోనీ—?"

—ఇచ్చట స్నేహములు చేయబడును....మతము, కులము, భాష, ప్రాంతం, కొండొకచో వయసు; వీటి ప్రమేయం లేకండా—అని కొంతమంది మొహాలమీద రాసినట్టు కనబడుతూ వుంటుంది. కాని ఈ సిటీల్లో కొంతమందికి మాత్రమే ఆ మొహాలమీది రాత చదవడం చాతనవుతుంది. ఆ కొంతమంది లోనూ బహుకొద్దిమందికి మాత్రమే ఆ చదువుల సందేశం సఫలం చేసుకోడానికి కావలసిన తీరికా తాహతూ వుంటాయి.

"రెండు నిమిషాలీ హోటల్లో ఆగి ఓ కప్పు కాఫీ తాగితే యేం?" అన్నాడతను; రెండడుగులు వేసి, ఆగి.

"ఇద్దరం వెడుతున్నాం—ఒక్క కప్పు కాఫీట—" అనుకుంది గిరిజ; అతనికి చిరునవ్వు విసిరి. "ఫిఫ్టీ— ఫిఫ్టీ"—అని చెవుల్లో యేదో గింగురు మంది. ఫిఫ్టీ-యాభై-పచాస్...! ఎక్కడ చెప్పడం, యెలా చెప్పడం—? ఎప్పటికప్పుడే కొత్త! ఓమాటొక కుర్ర సన్యాసి కాఫీ హోటల్లో టేబిల్‌మీద పెన్నుతో రాస్తే కాసేపు అర్థంచేసుకోలేక; చివరికి అర్థమవగానే చెమట్లు కక్కేసేడు.

ఫామిలీరూమ్‌లో—ఎదురెదురుగా కూచున్నారు...మాటాడుకోడం : దుర్భొంతుల వారీగా కళ్ళలో కళ్ళుపెట్టి చూసుకుంటూ మనసు పరిచిన తెరలని ఒత్తిగిల్లించి అక్కడేముందో చూసుకుందామని ప్రయత్నిస్తున్నారు....

అబ్బాయే చివరికి— "కొంచెం సాయం చేద్దురూ!" అన్నాడు.

"ఏమిటి— టేబిల్ జరుపుదామంటారా?"

"అదికాదు. మిమ్మల్నెక్కడో చూశాను. ఎక్కడా అని ఇదవుతున్నాను."

"బహుశా కలలోనేమో?"

అతనూ నవ్వాడు. "మీరు బలే హ్యూమరస్‌గా మాట్లాడతారే!"

అంగీకరించాలి, తప్పదు! అతనన్న దానికల్లా వొప్పుకోడమే యివాళ నా డ్యూటీ.... నేను బాగా హాస్యధోరణిలో మాట్లాడతానంటున్నాడు. పోనీ, అలాగే కానీ!

వెయిటర్ వొచ్చి హాస్యానికి అడ్డు తగిలేడు...

"మీ ప్రోగ్రాం ఏమిటి?" అంది గిరిజ.

"మీ ప్రోగ్రామే నా ప్రోగ్రాం."

"నా ప్రోగ్రామ్ మీకు నప్పదు."

"అదేమీ?"

"నేనింటికెళిపోతాను. మా మేనత్త నాకోసం చూస్తూ వుంటుంది!"— బాగా చెప్పేను కదు!?

"ఇంటికి వెళ్ళేలోగా—"

"ఇక్కడికొచ్చేనుగా??"

"ఇక్కణ్ణుంచి పిక్చర్‌కి పోదామా?"

"ఏడ్చినట్టుంది మీ సలహా"—అన్నట్టు మొహం పెట్టింది గిరిజ." పిక్చర్‌కి వెడతారో బార్‌కి వెడతారో, మీ ఇష్టం: నేను వెళ్ళక!" అంది గిరిజ, చేతి గడియారం చూసుకుంటూ. "నేను తొమ్మిదిగంటల్లోగా యిల్లు చేరాలి. సినిమాకెళ్ళి మూడుగంటలు వేస్టు చేసుకోడం నాకు కుదరదు." —అంతలో అంత సంసారపక్షంగా మాట్లాడగలిగినందుకు కొంచెం గర్వపడ్డాది గిరిజ.

ఆతగాడు కంగారు పడిపోయాడు. "అలాగే అలాగే—ఐతే కాఫీ తాగేసి మా యింటికి వెళిపోదాం!"

"ఇల్లా?!"

కొంచెం బెరుగ్గా అటూయిటూ చూసేడతను. తాళాలగుత్తి తీసి చూపించేడు, "ఇది రోడ్డుమీద గేటు తాళం!—ఇదుగో ఇది ఇంటితాళం—" బాగానే చెప్పేడు, ఇంట్లో యెవరూ లేనేలేరని.

వెయిటర్ రావడం, ఇష్ట ఫలహారాలు తీసుకోడం అయింది. ఖుల్లాసాగా నవ్వుకుంటూ బైటపడ్డారు. "టాక్సీ!" అని కేకవేశాడతను.

"దూరమా?"

"దూరంకాదు గానీ; టైం దండగ పెట్టొద్దన్నారుగా? పైగా—" చిలిపి నవ్వులు కళ్ళలో నింపుకొని—నడిపించి మిమ్మల్ని అలవగొట్టేస్తే నాకేమిటి సుఖం?" అన్నాడతను.

"అబ్బో! పిట్ట కూత పెడుతోందే!" అనుకుంది గిరిజ.

"బర్కత్‌పురా చౌరస్తా" అని టాక్సీ అతనికి చెప్పేసి, వెనక తలుపు తెరిచి పట్టుకున్నాడతను. గిరిజ అతనికి తగలనంత సుతారంగా తగిలి, సీటులో చతికిలపడింది.

0 0 0

"రండి, ఇలా కూర్చోండి!....ఇప్పుడే బట్టలు మార్చుకొస్తాను....మీరు రిఫ్రెష్ కాదల్చుకుంటే అదుగో బాత్‌రూమ్. అవసరం అనుకుంటే స్నానం కూడా చెయ్యొచ్చు. అన్నీ అందులో ఉన్నాయి. నేనొచ్చేదాకా తోచకపోతే బొమ్మలు చూడండి," అని శృంగారం ధ్వనించే చిలిపిగొంతుకు మర్యాద కవి పించే చిరునవ్వు జోడించి అన్నాడతను.

ఆ మాటలనేసి అతనలా వెళిపోడం ఏమిటాని ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుంది గిరిజ.

పద్ధతి చాలా తేడాగా వుంది. ఇలాంటివాళ్ళు సాధారణంగా అనుభవించే ఆకలికంటె ప్రదర్శించే వెకిలితనం ఎక్కువ ఉంటుంది. టాక్సీలోనే సరసం ప్రారంభించేస్తారు. ఇతను—ఇప్పటిదాకా నన్నిక్కడికి ఎందుకు తీసుకొచ్చేడో తనకే తెలియదన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడు....అల్లరికూడా నిశ్శబ్దంగా చెయ్యగల వాడిలా వున్నాడు....

0 0 0

ఉక్క పెడుతోంది. లేచి ఫ్యాన్ వేసుకుంటే బావుణ్ణు. ఇంటికి రాగానే అతగాడు ఫ్యాన్ ఆన్‌చేసి గ్లాసుడు మంచినీళ్ళు ఇయ్యావలిసింది....కొంతమంది-ఆడపిల్ల రూమ్‌లోకి రాగానే కంగారు పడిపోతారు....ఇతను కంగారు పళ్లేదు గాని—....

కాలికింద పడింది, ఏమిటిది?....బ్రష్....పెయింటింగ్ వేసుకునేది—.. టేబిలుమీద పెట్టుకోరాదా?....ఆర్టిస్టుల కిలాటి చిన్న చిన్న జాగర్తలు తీసు కోడం తెలీదు కాబోలు....సైంటిస్టులూ అంతేట—పరధ్యానంగా—

ఇతనార్టిస్టా?

టేబిల్ మీద సగం రచించిన చిత్రం—కేన్వాస్—పక్కని ఫ్రేమూ సీలలూ—రంగుల ట్యూబులు—మేడిన్ యూ ఎస్ ఎస్సార్.

గోడమీద ఆ జమిలిరంగుల బొమ్మ ఇతనేసిందే నేమిటి చెప్మా? కళాభవన్‌లో ఎగ్జిబిషన్‌లో చూసిన ఆర్ట్ బొమ్మలా వుంది.... మోడర్న్ ఆర్ట్ అంటారుట.... ఏమీ అర్థంకాకపోడమే మోడర్నా?

ఆ గోడమీద అలివేలుమంగా వెంకటేశ్వర్లు పద్ధతిని గాడీ కలర్స్‌లో వున్న పుణ్యదంపతులు ఎవరో? ఇతని తల్లిదండ్రులు కాబోలు. కీర్తిశేషులు.... మున్నూటరవయి రోజులూ అహోరాత్రాలూ వెలుగుతూవుండే జీరోబల్బు....

అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులమీద ఈ పాతకాలపు బొమ్మలు ఇతను వేసినవయ్యుండవు.... ఆ మూలని అదుగో, శంతనుడు; గంగ, విశ్వామిత్రుడు, మేనక, అర్జునుడు, ఉలూచి! ఆ వరస వరసంతా కొనుక్కొచ్చి తగిలించిన బొమ్మలే.

ఈ ఈవినింగ్, ఆ ఈవినింగ్ కాలేజీ — కాలేజీ బ్యూటీ— బ్యూటీ బిజినెస్‌లోపడి- బిజినెస్ ఆర్గనైజేషన్ క్లాసుకి వెళ్ళలేకపోవడంవల్ల అక్కడ సాయంకాలమే రాత్రి...పోయి, చీకటి పడిపోయి, కరెంటు పోయినట్టయిపోతుంది. వాళ్ళంతా శూన్యంలోకి చూస్తూ వుంటారు....

ఏం క్లాసులో ఏమిటో! లెక్చరర్లంతా కుర్రపోకిళ్ళు తప్ప టీచింగూ లేదు కోచింగు అంతకన్నా లేదు....

పాపం క్రిష్ణమోహన్—ఇవాళ క్లాస్‌కొస్తే సెకండవర్‌లో లేచి వెళిపోదాం అన్నాడు.... పూర్‌మాన్!.... "నాతో అయిదు నిమిషాలు గడిపితే ఐదేళ్ళ నిద్రాహారాలు లేకుండా బతికెయ్యగలనంటాడు.... ఒంటిమీద చెయ్యేస్తే నేను అపవిత్రం అయిపోతాననచిట్టుగా ఒదిగి వొదిగి కూచుంటాడు. నా చిటికెనవేలు పట్టుకుని అదే పారవశ్యం అనుకున్నట్టుగా కళ్ళు మూసేస్తాడు....

—ఇతగాడేమయ్యేడు చప్మా?.... ఎక్కడిదా బాత్‌షవర్ చప్పుడు, ఈ ఇంట్లోదేలా వుంది.... స్నానంచేసి సెంటూగట్రా పూసుకొస్తాడో యేమిటో?

కానీ, ఈ గది బలే అందంగావుంది, కదు! అసలిలాటి గదులెక్కడేనా ఉంటాయాని? అబ్బ! ఎంత విశాలంగా వుంది!— ఆ మూలని రేడియోగ్రామ్, దాని నెత్తిని పేర్చిన రికార్డుల దొంతరా—పాడకపోయినా అంత అందంగా వున్నాయి!...ఆ కిటికీలకి కట్టిన తెరలో?

ఈ మంచం? అసలిది మంచమేనా. అదేదో సినిమాలో అన్నట్టు— గించమా?...ఫోంబెడ్డు—హంసతూలికాతల్పం కంటె మెత్తగా వున్నట్టుంది... దీనిమీద యెవరు బబ్బుంటారో?...బట్టల స్టాండుమీద ఆడవాసన ఎక్కడాలేదు... అబ్బాయి బ్రహ్మచారి అన్నమాటా?...నోనో—బ్రహ్మచారికాదు, "అవివాహితుడు" అనాలిగాబోలు, సుజాత చెప్పినట్టు.

ఆ గోడమీద ఆంగ్లో (ఇండియన్) అమ్మాయిబొమ్మ- కేలండరే, ఐనా వంతబావుంది! బంగారుతీగల్ని కుచ్చులా పోసినట్టుంది, ఆ అమ్మాయి జుట్టు! పట్టుకోడానికి చేతికి దొరికితే బావుణ్ణనిపిస్తోంది. ఈ ఏడాదైపోయాక ఈ కేలండర్ నాకిచ్చేస్తాదేమో అడగాలి— అలా అడిగితే ఇప్పుడే పట్టుకుపో అంటాడేమో?అలా అంటే నాకు బావుండదు—

ఈ టేబిల్ అద్భుతంగా వుంది. సరిగ్గా నాగదంత వున్నట్లుందిది. దీని మీద గాజుపలక చూద్దూ! ఇంత పెద్ద గాజుపలక ఎలా సంపాదించేరో? సంపాదించడం మాటదేవుడెరుగు- దీన్ని విరిగిపోకుండా ఈ ఇంటిదాకా ఈ టేబిల్ దాకాచేఎలా పట్టుకొచ్చేరో అసలు?——డబ్బుంటే సరి- కొండమీదికో దిగొచ్చేస్తుంది— ఇంత మంచి టేబిలు మీద. ఈ అద్భుతమైన గాజు పలక కింద ఇంత అసందర్భమైన బొమ్మ ఎందుకుపెట్టేరో?— మొగాళ్లంతా వాకటే —నలుగుర్లో వున్నప్పుడు ఏసీను అబిసీనుగా వుందంటారో, విడిగావున్నప్పుడు అదేసీను ఆసీనులైపోయి మరీ చూడ్డానికి సిద్ధ పడిపోతారు— —మదన్ మోహన్ గారిదగ్గర అసలైన ఫోటోల్తో ఒక ఆల్బమ్ వుంది. ఎవరికో గానీ చూపించని వన్నీ నాకు చూపించేవాడు. బొమ్మలు అసహ్యంగా వున్నాయని నేనంటే మొహమాటానికి అంటున్నావనేవాడు. అలాంటి ఫొటో లసలెందుకు తీస్తారో? మగవాళ్ల ఆనందంకోసం అడవాళ్ల బొమ్మలు వేస్తారు....ఆడది అలాంటి అసందర్భమైన భంగిమలో నుంచుంటే— (పోనీ, నుంచున్నట్టు ఫొటో తీయించుకుంటే—) చూసిన మొగవాడికి ఆనందం కలుగుతుంది కాబోలు. మరి లోకంలో సంగోరు మంది జెనాభా ఆడవాళ్లే కదా, వాళ్లకి ఆనందం కలగ జెయ్యవలసిన, కనీసం మొగవాళ్ల నేత్రానంద ఘట్టాలు ఆడ వాళ్లకి జుగుప్స కలగకుండా చూసే, అవసరం ఈ ఆర్టిస్టులకీ ఫొటోగ్రాఫర్లకీ లేదా అని!— లేదేమో? లిల్లీ చెప్పినట్టు ఇది మగవాళ్ల ప్రపంచంకాదు! మొగ వాళ్ల ప్రపంచం!— — అస లిలాంటి పోజులో నిల బడ్డానికి ఆ అమ్మాయి

యెలా వొప్పుకుందో?——ఒప్పుకునే వుంటుంది. —ఒత్తిడి, ధనంమీది మమ తరం, పొగడ్త మీది కాంక్ష అమెని అలాబందీని చేసుంటాయి, డబ్బుపారేస్తే దేనికైనా ఒప్పుకునే వాళ్ళుంటారు— ,... నాసంగతి వేరు- నేనింకా అంత బరితెగించిపోలేదు... మదన్ మోహన్ గారు శెక్రెటేరియట్ నుంచి కలెక్టర్‌గా వెళ్లుండక పోతే నేను బొత్తిగా "రిజర్వ్‌డ్" కదా!

బాగా ఉన్న వాళ్లలా వుంది, వీళ్లెవరోను. ఈ ఇంటికి అద్దెంత యిస్తు న్నారో? అసలిది అద్దెఇల్లు అయివుండదు. అద్దెలకిచ్చే యిళ్లు ఇలా ప్రతి గదికీ ఎటాచ్‌డ్ బాత్ రూమ్‌తో. ప్రతిరూమ్‌కీ ట్యూబ్ లైట్స్‌తో సీలింగ్ ఫాన్స్‌తో కడతారా? నా గదిలో అయితే ఆసలు వెల్తురే రాదు. లైటేసుకుంటే గోధుమ రంగుగా వుంటుంది గది. అదే వెలుతురనుకుని నేను బతికేస్తున్నాను.

ఈ గాజుకూజా ఎంత అందంగా వుందో! సాలార్ జంగ్ మ్యూజియమ్‌లో ఉన్నట్లున్నాయి ఇలాంటి కూజాలు... నీళ్లు చల్లగా ఉన్నాయి. ప్రాణం లేచొచ్చింది... ... అన్నీ బావున్నాయమ్మా, చాలా బావున్నాయి! కాని, ఎన్నని అనుకోడం? అసలిక్కడ బావులేని వంటూ యేమైనా ఉన్నాయిగనకనా?

ఇతగాడి స్నానం ఇంకా అయినట్టులేదు...ఏంస్నానమో, దూర్వాస మహా ముని తమ్ముళ్లా వున్నాడు...

అవతలగది తలుపు ఇంతసేపూ తీసే వుందా, నేచూళ్లేదే?... ఆగోడ మూలని, అమ్మబాబోయ్. ఆ తుపాకీ ఎంతపొడుగుందో! ...దగ్గిరికెళ్లి చూస్తె బావుణ్ణు.., అబ్బ! ఐదు తుపాకులూ, మూడు బాకులూ,.. ఆ గోడమీద నడి మధ్యని వేలాడదీసిన కత్తిలాంటిది సినీమాల్లో యుద్ధం సీన్లలో చూపిస్తూ వుంటారు... ఈ ఆయుధాలన్నీ ఎందుకో, ఇతగాడికి? వీళ్ల పూర్వులెవరో రాజా స్థానాల్లో పనిచేసి వుంటారు. ఇతను రాజవంశంవాడా? అప్పటిసామగ్రి అంతా ఎగ్జిబిషన్ పెట్టినట్టు ఈ గదిలో పేర్చేరు,.. ఈ గదిలో వాసనేమిటి ఇంత గమ్మత్తుగావుంది, ఏదో జంతువు చచ్చినప్పటికంపు లాగ?

అయ్యబాబోయ్, పులి! ... ... పులికాదు... మంచితమాషాగా వుంది... రాయితో పులిబొమ్మ తయారుచేయించి దాని వొళ్లంతా కాళ్ల దగ్గిర్నుంచి మెడదాకా పులితోలు కప్పి తల ఏకంగా పులి తలే తగిలించేశారు... ... మెడమీద ఈ చిన్న బెజ్జం లేకపోతే ఈ పులితోలు పులిని చంపకుండా యెలా తీసేరా అని ఆశ్చర్యం కలుగుతుంది.,. ఈ పులి తల ఎంత ఫ్రెష్‌గా వుంది!

నిజంగా బతికున్నపులిలా గుంది... మొన్నాదివారం బతికినకాలేజీలో నాతో మాట్లాడినట్టున్న ఈపులి ఈ బుధవారానికల్లా చచ్చిన కాలేజీకి తయారైంది,

ఈ పులి. ఈ లేడి చెర్మాలూ, ఈ దుప్పికొమ్ములూ, ఈ చిరతపులి తలా. తలా వొక కథా చెబుతున్నాయి. వీళ్లతాత రసపుత్ర వీరుడు. వీళ్లనాన్న మొదటి ప్రపంచయుద్ధంలో ఆర్మీ ఆఫీసరు. వీళ్ల పెద్దన్నయ్య రెండో ప్రపంచ యుద్ధంలో చేశుంటాడు. వీళ్ల పూర్వీకులంతా వీరపురుషులూ, వీడు విలాసపురుషుడూ కాబోలు. వాళ్లందరూ శత్రుపుల్ని సింహాల్ని పులుల్ని వేటాడితే వీడు అమ్మాయిల్ని వేటాడుతున్నాడు... ఈమధ్య వేట ఉద్యమాలు సన్నగిల్లి మనుషుల్నే చంపుతున్నారు మనుషులు. ఏపేపర్లో చూసినా రోజూ వొక హత్య.., చంపాలనే కోరిక కొందరిలో సహజం. ఆ మధ్య ఎవరో "స్టూడెంటు" కుర్రాడుఏదో విచిత్రమైన టెక్నిక్ వుపయోగించి ఏడుగురు అందమైన నర్సుల్ని చంపేసేట్ట.

ఆ గోడమీద వేలాడుతున్నలాంటి అందమైన పెయింటింగు వేసినవాడు హత్యలు చెయ్యగలడా?.... ఏమో?.... ఈ పెయింటింగు చాలా గాభరా పెట్టే రకంగా వుంది. దీన్లాగే యితని మనస్సు కూడా అల్లకల్లోలంగా రక్తదాహంతో నిండి వుందేమో? "సైకో" అన్న సినిమాలో వొకణ్ణి చూపించేరు. ఆడవాళ్ళని ఆకర్షించే ధోరణిలో వాడు ఇలాగే సన్నంగా పొడుగ్గా అమాయకంగా కనిసించేడు. అమాయకంగా, తెలివితక్కువగా కనిపించే వాడుకూడా ఒకొక్కప్పుడు కొంపలు తీసే కొరివి కాగలడు.... ఇంకా బాత్‌రూమ్‌లోనే వున్నాడేమిటి చెప్మా? నీళ్ల చప్పుడు అగిపోయి చాలాసేపైనట్టుంది. ఇంకా బాత్‌రూమ్‌లో యెందుకుంటాడు? బాత్‌రూమ్‌లోంచి ఇటు రాకుండా అటునుంచటు వెళిపోడానికి దారి వుందా? ఏమో?.... ఏం ఏర్పాట్లు చేస్తున్నాడో? తాగుతాడు కాబోలు! నన్నూ తాగమంటాడో యేమిటో? తాగుతే నోరంతా వాసన.... బాపుండదు.... వాడికి ముద్దొస్తే నాకు డోకొస్తుంది....మదన్ మోహన్‌గారు కూడా ఇంతే. తాగమని నన్ను చంపుకు తినేవాడు.

ఈ ఇల్లు సరిగా నా మనస్సులా వుంది కదూ నా మనస్సులో మూడు ముఖ్యమైన కోరికలున్నట్టే ఈ యింట్లో ముఖ్యంగా మూడు గదులున్నాయి. నా మనస్సులో కోరికలు—— నా "వాంట్స్"- అన్ లిమిటెడ్ కదా - కాదు, నా కోరికలు అసంఖ్యాకం కాదు. నేనంత అత్యాశాపరురాలిని కాను. నాకు అత్యవసరమైనవి. నా కోరికలు; మూడే మూడు!

డిగ్రీ.

పెళ్లి.

బ్యాంకులో డబ్బు- అదీ కొంచెమే-

నా కోరికలెలా తీరుతాయి? నాకు డిగ్రీ యెలా వొస్తుంది? రోజంతా ఆఫీసులో పని చేసేసి నా బ్రెయినంతా ఫ్రైయినై పోతోంది. నాపరాతిని కరిగించే నరుడి దృష్టి నామీద రోహిణీకార్తె ఎండలాపడి నన్ను అలవ గొట్టేస్తోంది. ఇంక నాకు చదువుమీద దృష్టెలా నిలుస్తుంది? దృష్టంతా చదువుమీద కేంద్రీకరించి రోజూ క్రమం తప్పక కాలేజీకి వెళితే డిగ్రీ వొస్తుందేమో! నేను మిస్సయిన లెసన్సు నాకెలా వంటబడతాయి? కృష్ణమోహన్ చెబుతానంటాడు. అతని దగ్గిర కూచుందికి నాకు టైమ్ లేదు. అతన్తో వుంటే నాకు థ్రిల్ లేదు. టైమ్ వేస్టు చేస్తున్నట్టుంటుంది.... కాలేజీకి వెడితే అందరూ నావేపు అదోలా చూస్తారు....అసహ్యంగా వుంటుంది.... చూడరేమో అని దిగులూ వుంటుంది. పాఠం వినబడదు. ఈ చెవిని వినబడ్డదికాస్తా అ చెవిలోంచి బైటికి పోతుంది.... ఇంక నాకు చదువెలా వొస్తుంది! నాకు చదువు రాదు. నాకు డిగ్రీ రాదు.

నాకు పెళ్లి కూడా అవదు. నేనిలాగే మూడేళ్ళ డిగ్రీ కోర్సుని ఆరేళ్లో పదేళ్లో చదువుతాను. మార్చి సెప్టెంబర్లు నన్ను మా[illegible] మార్చి పరీక్షించి చివరికి ఏమార్చి వదుల్తాయి. రుక్మిణికి కిందటేడు డిగ్రీ పెళ్ళి-రెండూ కలిసొచ్చేయి. అంతకి ముందే ఉద్యోగం వుంది.... నువ్విలా అవకాశం దొరికినప్పల్లా అడ్డమైన వాళ్ళతోటీ తిరిగితే నీకు పెళ్ళవదంటూ మొన్న నొకనాడు వార్నింగిచ్చింది. నాకారాత్రి నిద్దర పట్టలేదు. నన్నెవరెవరో చంపడానికొచ్చినట్టు భ్రాంతిలో పడిపోయేను. నాలుగైదు రోజుల్దాకా రుక్మిణిమొహం చూడబుద్ధెయ్యలేదు. ఇప్పుడు రుక్మిణికీ నామొహం చూడ బుద్ధెయ్యదు గాబోలు. నన్ను పలకరించదు; డబ్బు అవసరమైతే తప్పా. మొన్న ఫస్టునాడు నాదగ్గిర ఎనభై రూపాయలు పట్టుకెళ్లింది; "సోఫాసెట్ కొంటున్నాం" అని- మీ ఆయనికి నువ్వే సోఫా కం బెడ్డుకదా అని నేనేదో జోకేస్తే ఉడుక్కుని డబ్బు తపీమని టేబిలుకేసి కొట్టింది. చివరికి ఎలాగో నన్ను ఉద్ధరించడానికన్నట్టు పట్టుకెళ్లింది. సోఫాకం బెడ్డు, గ్యాస్టవ్వు, ప్రెషర్ కుక్కరు, రేడియోగ్రామ్, గది మధ్యని పెద్ద టేబిలు, దానిమీద అద్భుతమైన గాజుపలక; దానికింద అసందర్భమైన బొమ్మ— ఇవన్నీ ఉంటాయా, రుక్మిణి ఇంట్లో? రుక్మిణి

వాళ్ళింటికి నన్ను తీసికెళ్ళలేదు, తీసికెళ్ళదు........ ఒకటి మాత్రం నిజం.... పక్కింటిల్లో ఎన్నున్నా సరే, ఆ గదిలో, కిటికీ పక్కని; మంచంమీద పడుకునేవాళ్ళని దొంగచాటుగా చూడ్డానికే వేసినట్టున్న ఆ అల్లిబిల్లి తమాషాముక్క మాత్రం ఉండదు గాక ఉండదు....

నాకు బ్యాంకెకౌంటు మరో కనీసపు కోర్కె.... ఇదంతా నాకు తెలీకుండా జరిగిపోయింది. నేను బతకడానికి స్ట్రగులవుతున్నాను. నా పతనానికి మదన్ మోహన్‌గారు కారణం. విజ్ఞానంతో, అధికారంతో; తెల్లగా తళతళలాడే మదన్ మోహన్‌గారు; గుండ్రంగా, నున్నగా మదనమోహనంగా పచ్చగా నిగనిగలాడే మదన్ మోహన్; కోరికతో ఆకలితో ఎర్రగా కణకణమండే మదన్ మోహన్‌గాడు—తన సుఖంకోసం అమాయకురాళ్లయిన వర్కింగ్‌గర్ల్స్‌ని సెడ్యూస్ చేసుకు తినే నల్లపిల్లి మదన్ మోహన్ వెధవ!—వాడే నన్నీ రొంపిలో మొట్టమొదటిసారిగా దింపేడు. నాకీ వెధవ బతుకిష్టం లేదు. ఈ మాంసం కొట్టు మీది లాభంతో పేర్చిన బ్యాంకెకౌంటు పేకమేడలో నేను నివసించలేను. నా అపకీర్తిని పట్టించుకోనట్టు నటించగల పురుష పుంగవుడి మనస్సులో గదికి పగిడీ కట్టడం కోసం నేనీ తాపత్రయ తాపం భరిస్తున్నాను. నాకు స్థిరమైన నడవడీ, నిశ్చలమైన జీవితం కావాలి. ఎలా వస్తాయి?........ నా భవిష్యత్తు తాళం వేసీసిన ఈ నాలుగో గదిలాగ అగమ్యగోచరంగా వుంది....

ఈ గదికి ఇంత పెద్ద తాళంకప్ప వేసేరెందుకో? ఈ కప్పతాళం చాల్లేదన్నట్టుగా ఈ తలుపులకి పాతకాలపు "తిప్పుడు తాళం" ఒకటి కూడా వేసేరు.. కీహోల్ స్క్రెక్టేదీ కనబడ్డం లేదు. అంతా చీకటి.... నల్లటి తెర ఏదో తలుపవతల వేళ్లాడుతున్నట్టుంది. "ఉత్తరపు గదికి మాత్రం వెళ్ళకుమా, రాజకుమారా!" అని పేదరాసి పెద్దమ్మ రాజకుమారుడికి వార్నింగిచ్చిన కథ మామయ్య చెప్పేవాడు. విలన్ మంత్రి చేతుల్లో మర్డరైపోయిన రాజదంపతుల శవాల్ని గంధర్వ శాపం తీరేవరకు ఉంచాలని సేనాపతి ఉత్తరపుగదిలో దాచేట్ట.... అలాగ్గానే వీడు; తను ఇంటికి తీసుకొచ్చి చెరిచేసిన అమ్మాయిల కళేబరాల్నిగాని ఈ గదిలో దాచలేదు కదా! ఈ మూడు గదులూ తిరిగినట్టు అందులోక్కూడా నేనెళిపోతానని తాళాలెయ్యలేదు కద! అంటే, నేను బతికుండగా ఆ గదిలోకెళ్ళకూడదు... ఇంకో గడియపోతే వీడు సైకోగాడిలా వొచ్చి ఆ గదిలో కత్తో తుపాకీయో తెచ్చి నన్ను చంపేసి ఈ నాలుగో గధిలో డంప్ చేసేస్తే మళ్ళీ

నాంపల్లి జంక్షన్ కెళిపోతాడో యేమిటో!.... నాకీ గాంధర్వ శాపం ఎప్పటికి తీరుతుంది, దేవుడా!

వస్తున్నాడు; అదుగో! ట్రే ఏదో తెస్తున్నాడు.... ట్రేలో ప్లేట్లలో అమ్లెట్లు. బ్రెడ్డు.... ఫోర్కులు. కత్తులు.... విస్కీ సీసా........ గ్లాసులు.... ఐస్ ముక్కలు........ సాసర్లో రూపాయలు.... అన్నీ ఎర్రగా, పళువాంఛ ఎర్రగా;........ తెచ్చేస్తున్నాడు: పైకోగాడు! ఆ కత్తుల్తో బ్రెడ్డు కొయ్యాడు– అమ్మో! నా గుండె కొసేస్తాడు వీడు.... నేరక పోయొచ్చేను తల్లోయ్....

* * *

"సారీ! చాలా ఆలస్యం అయినట్టుంది!"

వెధవ చిర్నవ్వూ వీడూనూ. అంతా షో.... తేనెపూసిన కత్తి....

"ఇక్కడ కూర్చుందా మంటారా?........ ఉండండి ఈ తివాసీ పరి చేస్తాను!"

వెనక్కి తిరిగున్నప్పుడే ఆ గోడమీది కత్తితీసి వీణ్ణి పొడిచీసి పారి పోతేనో?

"ఆ కత్తులూ అవీ– మా బాబాయిగారు పోగుచేసేరు. బావున్నాయికదు?"

చూసీసేడు, వెధవ!

"మీకు చెమట్లు పడ్తున్నాయేమిటి? ఫ్యాన్ పెట్టుకోలేకపోయేరా?"

నేర్చుకున్నాడెలాగయితేనేం, మర్యాద!

"రోజంతా పనిచేసి, పాపం అలిసిపోయుంటారు.... కొంచెం మొహ మేనా కడుక్కోవలిసింది–"

నా కష్టం గురించి ఈమాత్రం మాట అన్నాడు అదేచాలు.

"రండి, ఇలా కూర్చోండి.... ఇది తీసి జాగర్త పెట్టుకోండి.... యాభ య్యేయిదుంటాయి. వెళ్లేటప్పుడు టాక్సీలో వెళతారు కదా అని—"

"మంచివాడు....

"మీరు తీసుకోరా?.... మంచి స్టఫ్. మా చిన్నన్నయ్య తెచ్చేడు కిందటి నెల్లో. స్కాచ్ అంటారు. అబ్బే; దేశివాళీ సరుకులా చేదూ వెధవ్వాసనా ఉండ దండీ."

నేను ముందే అనుకున్నాను; వీళ్ళ వంశం మంచిదని—

"మీకు నచ్చకపోతే వద్దులెండి........ ఆ వాసన కూడా కిట్టదా?.... సర్లెండి. నేను మీరెళ్ళిపోయాకే తీసుకుంటాను."

○ ○ ○

నన్ను తాగమనడు. నా గుండె కొయ్యడు. నన్ను వీడేమీ చెయ్యడు. వీడు ఆర్టిస్టు. రష్యాలో తయారైన మంచిరకం ఆయిల్ కలర్ ట్యూబ్స్‌తో జపనీస్ కేన్వాస్‌మీద నా పోర్ట్రెయిటు అందంగా వేస్తాడు. నా బొమ్మ తయారయ్యేక ఈ గదిలో పడమటి గోడమీద ఆ అల్లకల్లోలం బొమ్మ తీసేసి అక్కడ వేళ్లాడగడతాడు. నేను అలిసిపోకుండా ఫ్రెష్‌గా వుండేటట్టు చూసుకుంటాడు. నన్ను అడుగు కింద పెట్టనివ్వడు. మధ్యగదిలో ఫోంబెడ్డుమీద ఫ్యాన్‌కింద కూచోబెడతాడు. నన్ను పీల్చి పిప్పిచేస్తున్న ఆ ఉద్యోగంనించి విముక్తురాల్ని చేస్తాడు. హైదరాబాద్ వొచ్చినప్పుడల్లా ధాష్టీకంగా కబురు పెట్టేసే మదన్ మోహన్‌గాడు ఈ మారొస్తే ఇక్కడికి తీసుకొచ్చి ఈ కత్తుల్లో వాడికి నచ్చిందేదో కనుక్కొని దాంతోనే వాణ్ణి ఖతమ్ చేసేసి, తాళం వేసిన ఈ నాలుగో గదిలో పారేస్తాడితడు. ఇతడు వీరుల వంశంలో పుట్టినవాడు. నా తప్పులన్నీ క్షమించి నాకు డిగ్రీ బ్యాంకెకౌంటూ లేకపోయినా నన్ను వరిస్తాడు......... కాని——

ఇవాళ సాయంత్రం నాకు నేనెంత ఘోరమైన అపచారం చేసుకున్నాను!.. యాభై రూపాయల డబ్బులకోసం ఈ సూర్యవంశ సంజాతుణ్ణి, చురుకు కటారి చూపుల సుందరాంగుణ్ని- అత్యధిక హృదయ వైశాల్యంగల ఈ ఆర్టిస్టుని..... శాశ్వతంగా వదులుకున్నాను!

నాకు భవిష్యత్తు లేదు.

* * *

(నా తమ్ముడు, సోమయాజులు రాయించిన కథ)